

# ప్రయాణికుల ఇబ్బందులు మాజీ ఎమ్మెల్యేకు తెలియవా?

- ఆయన వ్యాఖ్యలు ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే
- బైపాస్ రోడ్డు విస్తరణపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ సరైనదే
- భవిష్యత్ అవసరాల కోసమే 80 అడుగుల రోడ్డు
- 50 అడుగుల రోడ్డుతో సమస్య శాశ్వతంగా తీరదు
- మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (సిరి న్యూస్):** సంగారెడ్డి బైపాస్ రోడ్డు అభివృద్ధి విషయంలో మాజీ ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యలు కేవలం ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమేనని మాజీ సీడీసీ చైర్మన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి మండిపడ్డారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, రామప్ప, కౌన్సిలర్లు పొన్న రాజేందర్ రెడ్డి, శ్రీకాంత్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వ్యక్తిగత విమర్శలు, అనవసర ఆరోపణలు మానుకుని సంగారెడ్డి ప్రజలు రోజూ ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడితే ప్రయోజనకరంగా ఉంటుందని హితవు పీకారు. బైపాస్ రోడ్డుపై ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు, గుంతలు, ట్రాఫిక్ సమస్యలు మాజీ ఎమ్మెల్యేకు తెలియవా అని ప్రశ్నించారు. బైపాస్ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించాలన్నదే ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ అని స్పష్టం చేశారు. కేవలం 50 అడుగుల రోడ్డుతో సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందా? లేక భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 80 అడుగుల ఉన్న చోట 80 అడుగులు, 60 అడుగులు ఉన్న చోట 60 అడుగుల చొప్పున రోడ్డును నిర్మించి ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం చూపాలా అనేది ప్రజలే ఆలోచించాలని కోరారు. మొన్న ముఖ్యమంత్రి సంగారెడ్డికి వచ్చినప్పుడు ఐబీ ఆవరణలో రోడ్డు పనుల కోసం గోడలు కూల్చి, ఆగమేఘాల మీద పనులు చేపట్టినప్పుడు ప్రజల ప్రయోజనాలు గుర్తుకు రాలేదా అని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో సంగారెడ్డి పట్టణంలోని ప్రతి వార్డుకు రూ.8 కోట్ల అభివృద్ధి నిధులు ఇస్తామని ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటని నిలదీశారు. గతంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృషితో రూ.50 కోట్లు తెచ్చి పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. సంగారెడ్డి ప్రజలకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదని, మాటలు కాకుండా పనులు, హామీలు కాకుండా నిధులు, ప్రచారం కంటే నాణ్యమైన రోడ్లు కావాలని పేర్కొన్నారు. రోడ్డు పనులను వేగంగా పూర్తి చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌పై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు లాడే మల్లేశం, నవీన్, సురేష్, కసిని శ్రీకాంత్, విఠల్, వజిత్ తదితరులు పాల్గొన్నారు.

# లోదా సామాజిక వర్గం స్థితిగతులపై రాష్ట్ర బీసీ కమిషన్ విచారణ

- సిర్గాపూర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్




సిర్గాపూర్, సెప్టెంబర్ 16: తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో లోదా సామాజిక వర్గం ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, వృత్తి, జీవన పరిస్థితులను తెలుసుకునేందుకు బుధవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలం కడప్పల్ గ్రామం రైతు వేదికలో, నిజాంపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలలో క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు. బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాలలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి సతీష్ కుమార్, లోధా సామాజిక వర్గ ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ మాట్లాడుతూ లోధా సామాజిక వర్గానికి చెందిన ప్రజలను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలని కోరుతూ గత కొన్ని సంవత్సరాలుగా కమిషన్‌కు వినతులు అందుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా సామాజిక వర్గాల ప్రజలు రాష్ట్రంలో ఎక్కడెక్కడ నివసిస్తున్నారు, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, సంప్రదాయాలు, వృత్తులు, విద్యా స్థితిగతులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో లోధా సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఉన్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందని, కొన్ని ప్రాంతాల్లో వారికి బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతున్నప్పటికీ సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు రావడం లేదని కోరుతూ వినతులు అందినట్లు తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం, నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమైన తరువాత ఈ సామాజిక వర్గానికి సంబంధించిన వివరాలు, ఆధారాలను సరైన రీతిలో సమర్పించడంలో లోపాలు ఉన్నాయన్న అంశాలను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి విచారణలో భాగంగా లోధా సామాజిక వర్గ ప్రజల కుటుంబ పరిస్థితులు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, వృత్తులు, జీవన విధానం, పిల్లల విద్య తదితర అంశాలను నమోదు చేసుకుంటున్నట్లు చైర్మన్ తెలిపారు. విచారణ అనంతరం సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించి ప్రభుత్వానికి, సంబంధిత శాఖలకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2021 నుంచి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈడబ్ల్యూఎస్ కోటాలో 10 శాతం రిజర్వేషన్ అమల్లో ఉందని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నారాయఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ లోధా సామాజిక వర్గ ప్రజలు తమ సమస్యలను, స్థితిగతులను విచారించడానికి బీసీ కమిషన్ రావడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని, లోధా సామాజిక వర్గం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకుని అర్హత మేరకు లబ్ధి పొందాలని సూచించారు. నారాయణ ఖేడ్ డివిజన్ లో ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం కొనసాగుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలకు హాజరై పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, డీఎస్పీ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో, సర్పంచ్‌లు, లోధా సామాజిక వర్గ పెద్దలు, ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.